ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

చిన్నచెల్మడ అంగన్‌వాడీ కేంద్రానికి ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ సురేశ్

మునిపల్లి, మే 15: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మండల పరిధిలోని బుధేరా ఎస్‌బీఐ మేనేజర్ సురేశ్ ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని చిన్నచెల్మడలోని అంగన్‌వాడీ కేంద్రానికి రూ.2.50 లక్షల విలువ చేసే సామగ్రిని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఉండేవిధంగా చిన్నచెల్మెడ అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి అందించినట్లు తెలిపారు. చిన్నారులకు అర్థమయ్యేలా భవానికి రంగులతో కూడిన బొమ్మలు వేయించినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రానికి సాంసంగ్ టీవీతోపాటు కుర్చీలు, ఆట వస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మీనాక్షి, పంచాయతీ కార్యదర్శి అనిల్, గ్రామస్తులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలి

న్యాల్‌కల్, మే 15: ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉందని మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు అశోక్‌కుమార్, శ్రీనివాస్ అన్నారు. హద్నూర్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో చేరేందుకు ఈ నెల 31వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదివేందుకు ఎలాంటి ప్రవేశ రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రైవేటు కళాశాలకుకు ధీటుగా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో చదివేందుకు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తాకాలు, స్టడీ మెటీరియల్, అర్హులందరికీ ఉపకారవేతనాలను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కళాశాలలో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తూ ప్రతిభగల లెక్చరర్లతో విద్యాను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం పక్కా భవనాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడామైదానం, ఎన్ఎస్ఎస్ వంటి సౌకర్యాలున్నాయన్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లోనే చేర్పించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

గుమ్మడిదలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గంగాభవాని

గుమ్మడిదల, మే 15: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని, కానుకుంట, నల్లవల్లి కేంద్రాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గంగాభవాని, గిద్దావరి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. రైతులను కలిసి మాట్లాడారు. వచ్చే నాలుగు రోజుల్లో వర్షసూచన ఉన్నట్లు ఆమె తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే విక్రయించాలని సూచించారు. ఆరబోసిన వడ్లను రక్షించుకోవడానికి ప్లాస్టిక్ కవర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షం వచ్చే సూచనలు కన్పించగానే అప్రమత్తం కావాలని, నష్టపోకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

మదర్‌మేరీ వృద్ధాశ్రమంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు విజయ్‌కుమార్

పటాన్‌చెరు, మే 15: ఇంద్రేశం గ్రామ పరిధిలోని మదర్‌మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. బుధవారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో ఎంకేవై యువసేన బృందం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ పాల్గొని కేక్ కట్‌చేసి వృద్ధులకు అందించారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మెట్టు కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా ఎంకేవై యువసేన చేస్తున్న అన్నదాన కార్యక్రమం స్ఫూర్తిదాయకం అన్నారు. పేద, బడుగు బలహీన వర్గాలకు మెట్టు కుమార్‌యాదవ్ అండగా ఉంటారని కొనియాడారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరించే మంచి మనిషి అని పేర్కొన్నారు. మెట్టు కుమార్‌యాదవ్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంకేవై యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బోరు బావులు తవ్వించిన దాత



సజ్జాపూర్‌లో బారు బావిలో నుంచి పుష్కలంగా వస్తున్న నీరు

కోహీర్, మే 15: మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి స్వగ్రామంలో తాగు నీటి ఇబ్బందులు తీర్చేందుకు సొంత ఖర్చులతో బోర్లు వేయించాడు. బుధవారం గ్రామంలోని పలు వార్డుల్లో మూడు బోర్లను వేయించి గ్రామస్తుల దాహార్తిని తీర్చాడు. బోర్లలో కూడా పుష్కలంగా నీరు రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులు తీర్చినందుకు దాత ప్రసాద్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడివిరెడ్డి, గోపాల్, రాంచందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

అన్నదాత అవస్థలు!

జిన్నారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

- తూకంలో తరుగు తీస్తున్నారని ఆవేదన
- కొనుగోలు కేంద్రాల్లో నిత్యకృత్యం!
- అలాంటిదేమి లేదంటున్న సిబ్బంది
- వెంటవెంటనే కొనుగోలు చేయాలంటున్న రైతులు

జిన్నారం, మే 15: అన్నదాతకు అడుగడునా కష్టాలే ఎదురువుతున్నాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేయడం ఒక ఎత్తైతే.. చేతికొచ్చిన ధాన్యాన్ని కల్లాలకు తీసుకొచ్చి ఆరబోయడం మరో ఎత్తు. అన్ని బాగుండి పంటను ఆరబెట్టిన తర్వాత ఇక అమ్మకానికి సిద్ధమైన సమయంలో ప్రకృతి కరుణి కన్నెర్ర జేసి అకాల వర్షాలు కురవడంతో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు ఆగమయ్యారు. మళ్లీ తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయిద్దామంటే కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది పెట్టే కొర్రీలతో మరింత నష్టపోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు.

మాటకారులదే ముందు వరుస

ఐకేపీ ఆధ్వర్యంలో జిన్నారం, ఊట్ల, నల్తూరు, శివనగర్ గ్రామాల్లో నాలుగు చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రం జిన్నారంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి అక్కడే ఆరబోస్తున్నారు. తేమ శాతాన్ని అక్కడే పరీక్షించి కాంటా పెడుతున్నారు. 40 కిలోల సంచిలో తరుగుతో కలిపి 42 కిలోలు తీయాల్సి ఉండగా అరకిలో ఎక్కువ తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. పైగా ముందుగా వచ్చిన వారికంటే వెనుకొచ్చిన వారి ధాన్యాన్ని తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి వడ్లు తడిచిపోయాయని, ముందుగా వచ్చిన వారి వడ్లను ముందుగా తీసుకొని ఉంటే ఇబ్బందులు, బాధలు తప్పేవని పలువురు రైతులు చెబుతున్నారు. తేమ 17 శాతం కంటే ఎక్కువ ఉన్నా తెలిసినవారివి, నోరు పెంచే వాళ్లవి సిబ్బంది తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

భయాందోళనలో అన్నదాతలు

జిల్లాలో వారం రోజులుగా వాతావరణంలో మార్పులు కన్పిస్తున్నాయి. మధ్యాహ్నం ఎండగా, సాయంత్రం చల్లబడి తేలికపాటి జల్లులు పడుతున్నాయి. మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు భయంభయంతో రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి ఆరబోసిన ధాన్యం, బస్తాల్లో ఎత్తిన ధాన్యం తడిసిపోయింది. వడ్లు వాననీటిలో కొట్టుకుపోగా మళ్లీ దగ్గరికి చేర్పి ఆరబెట్టాల్సి వచ్చింది. అప్పటి నుంచి రైతులు రాత్రిపూట ఆకాశానికేసి చూస్తున్నారు. ఎప్పుడు వర్షం వస్తుందోనని కొనుగోలు కేంద్రం వద్దే జాగారం చేస్తున్నారు. ఆరబోసిన వడ్లు తడవకుండా వాటిపై పట్టాలు కప్పుతున్నారు. ధాన్యాన్ని కాంటా పెట్టించే వరకు బాధలు తప్పవని పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన పలువురు రైతు ఆవేదనను వెలుబుచ్చారు.

జిన్నారంలో ఇటీవల కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యం

వెనుకొచ్చిన వాళ్లవే తీసుకుంటున్నరు

కొనుగోలు కేంద్రానికి ముందుగా ధాన్యం తెచ్చిన మాకంటే వెనుకొచ్చిన వాళ్ల వడ్లనే తీసుకుంటున్నరు. నోరు పెంచే వాళ్ల ధాన్యం కాంటా పెడుతున్నరు. తేమ శాతం సరిగా ఉన్నా మా వడ్లకు కాంటా పెడుతలేరు. అడిగితే ఇంకా ఆలస్యం చేస్తారేమోనని ఏమీ అనడం లేదు. రోజుల తరబడి ఇక్కడే పడిగాపులు కాస్తున్నాం. ఇలా నేను ఒక్కడినే కాదు.. చాలామంది ఇబ్బంది పడుతున్నాం.

- నరేందర్‌రెడ్డి, రైతు

వర్షానికి వడ్లు మొత్తం తడిచిపోయాయి

సరిపడా గనీ బ్యాగులు ఉన్నా.. వడ్లు తడువకుండా వాటిపై కప్పేందుకు సరిపడా పట్టాలు దొరకడం లేదు. వారం కింద కురిసిన అకాల వర్షానికి వడ్లు తడిసిపోయాయి. మళ్లీ వాటిని సంచుల్లోంచి కింద గుమ్మరించి ఆరబోసి ఎండిన తర్వాత సంచుల్లో నింపాం. డబుల్ పని అయ్యింది. కొనుగోలు కేంద్రం సిబ్బంది వెంట వెంటనే కాంటా పెడితే రైతులకు ఇలాంటి ఇబ్బందులు రావు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలి.

- గిరి, రైతు

ముందు వచ్చిన వారివే కాంటా పెడుతున్నాం

ప్రతి రోజు తేమ శాతాన్ని పరిశీలిస్తున్నాం. తేమశాతం సరిగా ఉండి కొనుగోలు కేంద్రానికి ముందుగా వడ్లను తీసుకువచ్చిన వారివే కాంటా పెడుతున్నాం. ఐకేపీ సిబ్బంది ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే వారివి తీసుకోవడం లేదు. దీంతో రైతులు మా ధాన్యం ఎందుకు తీసుకోవడం లేదని సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,203 చెల్లిస్తున్నాం. ఏ రోజుకు ఆ రోజు కొనుగోలు చేసిన ధాన్యాన్ని గుమ్మడిదల లోని అన్నపూర్ణ రైస్‌మిల్‌కు తరలిస్తున్నాం. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

- నరేందర్, ఐకేపీ ఏపీఎం

బాధితులకు అండగా కార్పొరేటర్

దగ్ధమైన వస్తువులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, మే 15: ఆర్సీపురం డివిజన్‌లోని అశోక్‌నగర్‌లోని కూరగాయలు, చెప్పుల దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగి ఆయా దుకాణాల్లోని వస్తువులన్ని దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పుష్పానగేశ్ బుధవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకొని రెవెన్యూ, పోలీస్, ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అధికారులు అక్కడి వచ్చి వివరాలు సేకరించారు. అనంతరం బాధితులకు కార్పొరేటర్ ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి బాధితులకు సహకారం అందేవిధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కాలుష్య కారకాలతో అధిక ఉష్ణోగ్రతలు

- వాతావరణంలో వేడిని పెంచుతున్న గాలిలోని రసాయనాలు
- 3 నుంచి 10 శాతం మేర ఉష్ణోగ్రతలు పెరుగుతాయంటున్న పరిశోధకులు

సిటీబ్యూరో, మే 15(నమస్తే తెలంగాణ) : వాతావరణంలో చేరుతున్న రసాయన కారకాల ద్వారా కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లుగా వెల్లడైంది. హైదరాబాద్ నగర వాతావరణంలో పరిమితికి మించి చేరుతున్న కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, ఓజోన్, ఫార్మాల్డిహైడ్, సల్ఫర్ వంటి రసాయనాల కారణంగా ఏటా 3 నుంచి 10శాతం మేర ఉష్ణోగ్రతలు మార్పులకు లోనవుతున్నాయని, దీంతో ఏటా 1 నుంచి 2 డిగ్రీ సెల్సియస్ అధికంగా నమోదు అవుతున్నట్లుగా తేల్చారు. ఇందులో ప్రధాన నగరాల్లో ఆసిఫ్‌నగర్, చార్మినార్, గోల్కొండ, నాంపల్లి, బహదూర్‌పురా, అంబర్‌పేట, ఉప్పల్, సరూర్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లుగా తేల్చారు. ఎన్ఐటీ తిరుచ్చి చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. పట్టణీకరణ ఆధారంగా వాతావరణ మార్పులను అధ్యయనం చేసిన ఆ సంస్థ... అధిక ఉష్ణోగ్రతలకు వాతావరణంలో చేరుతున్న కాలుష్య కారకాలు కూడా దోహదపడుతున్నాయని, దీంతోనే ఎక్కువ వేడి ప్రభావితం అవుతున్నట్లుగా తేల్చారు. హైదరాబాద్ నగరంలోని మెజార్టీ ప్రాంతాల్లో కార్బన్ ఉద్గారాల పరిమాణం పరిమితికి మించి చేరుతుందని, కరోనా తర్వాత పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కంటే ఎక్కువగా వ్యక్తిగత వాహనాల వినియోగంతో గణనీయంగా వాహనాల సంఖ్య వృద్ధి చెందుతున్నట్లుగా తేల్చారు. ఈ ప్రభావం ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించి ఉన్నట్లుగా పేర్కొన్నారు. అదే సమయంలో ఔటర్ రింగు రోడ్డు మీద కూడా వాహన రాకపోకలు విపరీతంగా పెరగడంతో.. గాలిలో వాతావరణ కాలుష్యం తీవ్రత వలన ఉష్ణోగ్రతలు మారుతున్నట్లుగా వివరించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

ఝరాసంగం, మే 15: ఝరాసంగం మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామంలో బుధవారం జిల్లా ఉద్యానవన అధికారి సోమేశ్వరరావు ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ పంటను సాగు చేసే రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా ఒక ఎకరా మొక్కలకు రూ.11,600, డ్రిప్‌నకు రూ.22,518, ఎరువులకు రూ.16,800 సబ్సిబీ అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ పంటను ఒకసారి వేస్తే 25 సంవత్సరాల వరకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి స్పందన, గోద్రెజ్ యూరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అధికారులు భరత్, ఏసుబాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన అధికారి సోమేశ్వరరావు

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



మాట్లాడుతున్న రాయికోడ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ

రాయికోడ్, మే 15: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల్గించవద్దని రాయికోడ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రమైన రాయికోడ్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన మండల ఫర్టిలైజర్ డీలర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ విస్తరణ అధికారులందరూ తప్పకుండా రైతు వేదికల్లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో నమోదు చేసిన రైతు బంధు, రైతు బీమా, పంటల నమోదుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫర్టిలైజర్ డీలర్లందరూ తప్పకుండా ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్‌లను ఎప్పటికప్పుడు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు ఆధారంగా రైతులకు ఎరువులు విక్రయించాలన్నారు. ఎరువులు, విత్తనాలను అందుబాటు ధరల్లోనే అమ్మాలన్నారు. అధిక ధరలకు అమ్మినా, నిషేధిత పత్తి విత్తనాలను అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి అవినాష్‌వర్మ, మండల ఫర్టిలైజర్స్ డీలర్లు పాల్గొన్నారు.

ధర్మారం, లక్కపల్లి మధ్య అసంపూర్తిగా రోడ్డు నిర్మాణం

బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో!

మద్దూరు(ధూళిమిట్ట), మే 15: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని ధర్మారం, లక్కపల్లి గ్రామాల మధ్య బీటీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంకర తేలిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహన దారులు నరకయాతన అనుభవిస్తున్నారు. 2016లో బీఆర్ఎస్ ప్రభుత్వం 1.2కి.మీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మొరం పోసి, రెండు లేయర్ల మెటల్ పరిచాడు. నిధులు సరిపోక రోడ్డు నిర్మాణ పనులు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. అప్పటినుంచి బీటీ రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల ధర్మారం, పిట్టలగూడెం, లక్కపల్లి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళలల్లో కంకర రోడ్డుపై ప్రయాణం చేయలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొంతపల్లి సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఏఈ రవీందర్

గుమ్మడిదల, మే 15: విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం కలుగుతుందని ఆశాఖ ఏఈలు బుధవారం ప్రకటనలో తెలిపారు. గుమ్మడిదల సబ్ స్టేషన్ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, బొంతపల్లి, ప్రకృతినివాస్, కానుకుంట, దుండిగల్ ఎయిర్‌ఫోర్స్, నల్లవల్లి, సొలక్‌పల్లి, గడ్డపోతారం ఎస్ఎస్1, ఎస్ఎస్ 2 స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బొంతపల్లి, జిన్నారం ఏఈలు రవీందర్, రాజు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి బోరంచ నల్లపోచమ్మ ఆలయ జాతర

మనూరు, మే 15: మండల పరిధిలోని బోరంచ నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయ ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని ఈవో మోహన్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ జాతర ఏడు వారల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. 16న ఉదయం పంచామృత అభిషేకం, కుంకుమార్చనతో, ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమై జూన్ 27 వరకు కొనసాగుతాయని తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంలు కలగకుండా దేవాదయ శాఖ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

అధికారుల కృషితో ప్రశాంతంగా పోలింగ్

కోహీర్, మే 15: జహీరాబాద్ డివిజన్ పరిధిలో లోక్‌సభ ఎన్నిక ప్రశాంతంగా జరిగిందని ఆర్డీవో, డివిజన్ ఎన్నికల అధికారి రాజు తెలిపారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని 313పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలను నిర్వహించామన్నారు. జహీరాబాద్ డివిజన్‌లో మొత్తం ఓటర్లు 2,75,562 ఉన్నారన్నారు. ఇందులో 2,00,597 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. ఓటర్లతో పాటు ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులను అభినందించారు. ఇందుకు సహకరించిన మీడియాకు ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

చేర్యాల,/మద్దూరు(ధూళిమిట్ట), కొమురవెల్లి, మే 15: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక 27న జరగనుందని, కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ మద్దూరు మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, తీన్మార్ మల్లన్న టీం నియోజకవర్గ కోఆర్డినేటర్ అహ్మద్ అఖిల్ పాషా, కామిడి జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశంలో తీన్మార్ మల్లన్న గెలుపుపై సమీక్షించారు. కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం అబ్జర్వర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. గురువారం తీన్మార్ మల్లన్న చేర్యాల పట్టణానికి రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ము రవి ఒక ప్రకటనలో తెలిపారు.

సవరణ

15-05-2024న **నమస్తే తెలంగాణ మరియు బిజినెస్ స్టాండర్డ్** వార్తాపత్రికల్లో ప్రచురించబడిన ఇ-వేలం అమ్మకం ప్రకటన చూడగలరు. అట్టి ఇ-వేలం ప్రకటన **మొరంగ్‌పల్లి ఏసురత్నం** పేరుమీద ఇవ్వబడినదని ఇందుమూలముగా తెలియజేయడమైనది. దీనికి సంబంధించి వేలం తేదీని **14-06-2024**కు **బదులు 26-06-2024**గా చదువుకోగలరని కోరుతూ సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది. మిగతా ఇతర విషయాలన్నీ యథాతథం.

(A Govt. of India Undertaking)

సదాశివపేట శాఖ

అధీకృత అధికారి